www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 13 ఆగస్టు 2024

డాక్టర్ల చికిత్స గదిలోకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో ఆదివారం రాత్రి జోరు వాన కురిసింది. ఈ వర్షం వల్ల ఇటీవల సర్వజన బోధనాస్పత్రిలో డాక్టర్ల చికిత్స గదిలోకి వర్షపు నీరు చేరడంతో ఇబ్బందులు తలెత్తాయి. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే షాజహాన్ బాష వెంటనే సర్వజన బోధనాస్పత్రిని తనిఖీ చేశారు. డాక్టర్ల గదిలోకి వర్షపు నీరు రావడంతో రోగులకు చికిత్సలు అందించడం ఇబ్బందిగా మారడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టు ఏజెన్సీని రద్దు చేయాలని ఎంఎస్ డాక్టర్ ఎమ్మెస్ రాజుకు ఆదేశాలిచ్చారు. అనంతరం అక్కడ ఉన్న రోగుల్ని మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు ఏ విధంగా చికిత్స అందిస్తున్నారని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయా.. మరేమైన ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. అనంతరం రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని, ఏమైనా వసతులు అవసరమైతే తన దృష్టికి తీసుకొస్తే వాటిని ఏర్పాటు చేపిస్తానని మెడికల్ సూపరింటెండెంట్ కు తెలిపారు. రెఫరల్స్ ను తగ్గించి సాధ్యమైనంత వరకు ఇక్కడే వైద్య చికిత్సలు అందించాలన్నారు. రాబోయే రోజుల్లో అవసరమైన మార్పులు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తామన్నారు.

నీరు-చెట్టు బిల్లుకు మోక్షం!

- రూ.80 కోట్ల బకాయి చెల్లింపు
-సిఎఫ్ఎంఎస్ అప్‌లోడ్‌కు పరుగు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నీరు-చెట్టు బిల్లుల చెల్లింపుల ప్రక్రియ ఊపందుకుంది. జిల్లా నీటిపారుదలశాఖ 2018-19లో రూ.120 కోట్లతో కూడిన పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారం చేతులు మారింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడగానే నవరత్నాల అమలుకు ప్రాధాన్యత ఇచ్చింది. టిడిపి ప్రభుత్వ హయాంలోని 1,690 పనులకు సంబంధించిన రూ.80 కోట్ల బిల్లుల చెల్లింపులను నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా నీరు-చెట్టు పనులు చేసిన కార్యకర్తలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. 2019 డిసెంబర్‌లో టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా నీరు-చెట్టు బిల్లుల చెల్లింపులకు హైకోర్టును ఆశ్రయించి 12 శాతం వడ్డీతో సహా చెల్లింపులు చేయిస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. అనంతరం ఆర్థిక సామర్థ్యం కలిగిన కొంత మంది బిల్లుల చెల్లింపుల కోసం హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మూడేళ్లుగా నీరు-చెట్టు పనులకు సుమారు రూ.15 కోట్ల మేరకు బిల్లులు చెల్లింపులు చేయించుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో నీరు-చెట్టు బిల్లుల చెల్లింపులకు మోక్షం లభించింది. కూటమి సర్కారు నీరు-చెట్టు చెల్లింపులకు బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయింపులు చేసింది. ఉమ్మడి కడప జిల్లాలోని 1690 పనుల్లో 800 పనులకు రూ.40 కోట్లు మేరకు చెల్లింపులు చేసింది. 2024 సెప్టెంబర్ నాటికి మిగిలిన సుమారు 800 పనులకు సంబంధించిన రూ.40 కోట్లను నీరు-చెట్టు పనులు చేసిన వారికి చెల్లింపులు చేయనున్నారు. జిల్లాలో నీరు-చెట్టు పనులు చేసిన కార్యకర్తలు తమ పనుల వివరాలను సిఎఫ్ఎంఎస్ అప్‌లోడ్ చేసుకోవడానికి పరుగులు తీస్తుండడం గమనార్హం.

ఎట్టకేలకు నీరు-చెట్టు బిల్లు చెల్లింపులకు మోక్షం లభించింది. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌లో నీరు-చెట్టు పథకం పెండింగ్ బకాయి చెల్లింపులకు రూ.250 కోట్లు కేటాయించింది. 2014-2019 టిడిపి ప్రభుత్వ హయాంలోని నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రాధాన్యత ఇచ్చింది. ఈనేపథ్యంలో నీరు-చెట్టు పథకం కింద పనులు చేసిన పలువురు కార్యకర్తలు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం సిఎఫ్ఎంఎస్‌లో తమ పనులు అప్‌లోడ్ చేసుకునేందుకు పరుగులు తీస్తుండడం గమనార్హం.

స్కూల్ బస్సు బోల్తా.. విద్యార్థి మృతి

- ఇద్దరు విద్యార్థుల పరిస్థితి విషమం
- ఘటనా స్థలిని పరిశీలించిన డిఇఒ, ఆర్‌టిఒ

ప్రజాశక్తి-పుల్లంపేట/రైల్వేకోడూరు

మృతి చెందిన విద్యార్థి భవిష్య

బోల్తా పడిన పాఠశాల బస్సు

అన్నమయ్య జిల్లా ఓబుల వారిపల్లి సమీపంలో సోమవారం ప్రయివేటు పాఠశాల బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెండవ తరగతి విద్యార్థి భవిష్య(8) అక్కడిక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. మండల పరిధిలోని చిన్నఓరంపాడు వద్ద ఉన్న శ్రీవాణి హైస్కూల్‌కు చెందిన బస్సు 20 మంది విద్యార్థులతో ఓబులవారిపల్లె నుంచి బస్సు బయలుదేరింది. ఓబుల వారిపల్లె దాటిన తర్వాత బస్సు డ్రైవర్ అధిక స్పీడ్‌తో డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డుకు పక్కన ఉన్న స్తంభాలను బలంగా ఢీకొని బోల్తా పడింది. డోర్ దగ్గర ఉన్న విద్యార్థిని డోర్‌లో నుంచి కింద పడిపోయింది. బస్సు విద్యార్థిని మీద పడటంతో అక్కడికక్కడే ప్రాణాలను వదిలింది. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. విద్యార్థిని మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే ఘటనాస్థలికి స్థానిక ఎస్ఐ మహేష్ నాయుడు తన సిబ్బందితో చేరుకొని ఘటనపై ఆరా తీశారు. రైల్వేకోడూరు ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థికి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామని ఎస్ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బస్సు బోల్తా పడిన విషయం తెలుసుకున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి, ఆర్‌టిఒ వినోద్‌కుమార్, సిఐ టి.బాబు, తహశీల్దార్ పీర్‌మున్నీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై పాఠశాల గేటు వద్ద ఎఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన దిగారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఒక విద్యార్థి మృతి చెందిందని పేర్కొన్నారు. రాజకీయ కక్ష చూపకుండా విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నాకు దిగారు. నాయకులకు ఎస్ఐ సర్దిచెప్పి ధర్నాను విరమింపజేశారు.

పాఠశాల యాజమాన్యపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

శ్రీ వాణి విద్యానికేతన్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి చెందిందని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డబ్బులే ధ్యేయంగా విద్యార్థులకు ఫిట్‌నెస్ లేని స్కూలు వాహనాలను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌టిఒ అధికారులు ప్రతి సంవత్సరం బస్సులకు రెన్యువల్ చేస్తూ వాటిని కండిషన్ ఉందా లేదా అనేటు వంటిది చూసి చూడనట్లు వ్యవహరించడం ద్వారానే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సమస్యపై డిటిఒ, ఆర్‌టిఒ, ఎంవిఐలకు అనేకమార్లు తెలియజేసినా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. రవాణా శాఖ మంత్రి మంటపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పందించి జిల్లాలో ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

రాయచోటి: ఓబులవారిపల్లి మండలంలోని శ్రీ వాణి పాఠశాలకు చెందిన బస్సు ప్రమాదంలో యాజమాన్యం నిర్లక్ష్యానికి బలై చిన్నారి మృతి చెందడం చాలా బాధాకరమని, విద్యార్థిని మృతికి కారణమైన పాఠశాల గుర్తింపును రద్దుచేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి జిల్లా బాధ్యులు అంకన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం పరిధిలో ఓబులవారిపల్లె మండలంలోని శ్రీ వాణి పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా బస్సు బోల్తాపడి భవ్యరెడ్డి అనే 2వ తరగతి విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. ఇంత వరకు ఆర్‌టిఒ అధికారులు విచారణ కూడా చేయలేదని వాపోయారు. పర్యవేక్షణ లేకనే ఇలా జరిగిందన్నారు. విద్యార్థిని కుటుంబానికి స్వయంగా పాఠశాల యాజమాన్యమే రూ.40 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

15 నుంచి భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణపై కలెక్టర్ రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ నెల 15న సదస్సులను లాంఛనగా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అధికారులు కార్యక్రమాన్ని బాధ్యతగా భూ సమస్యలు పరిష్క రించాల్సి ఉంటుందన్నారు. రోజూ ఉదయం 9 గంటలకు సదస్సులు ప్రారంభించాలన్నారు. రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులు విజయవంతం చేసేందుకు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి గ్రామాలలో టామ్ టామ్ వేయించి ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా ప్రచారం చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉంటుందని పెద్ద రెవెన్యూ గ్రామమైతే రెండు రోజులు కూడా సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరించాల్సి ఉంటుందన్నారు. అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించి షెడ్యూల్‌ను సిద్ధం చేసి పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులను జాయింట్ కలెక్టర్, డిఆర్ఒలు పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా 22 ఎ భూముల అక్రమాలతో పాటు, పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి ఆన్‌లైన్ చేయడంతోపాటు నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సదస్సులకు హాజరయ్యే రెవెన్యూ బృందాలు ఆర్ఒఆర్, అడంగల్, సంబంధిత రెవెన్యూ రికార్డులను వెంట తీసుకువెళ్లాలని వెళ్లాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే ప్రాంతంలో షామియానా వేసి నిర్వహించే ప్రాంతాన్ని తప్పకుండా ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజల నుంచి తీసుకున్న ప్రతి ఫిర్యాదుకు సంబంధిత అర్జీదారునికి రసీదు ఇచ్చి వచ్చిన అర్జీలన్నీ ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందన్నారు. తహశీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, సంబంధిత అధికారులు రెవెన్యూ సదస్సులలో తప్పక పాల్గొనాలన్నారు. భూముల సర్వే అనంతరం హద్దురాళ్లకు ఎటువంటి రాతలు ఉండకూడదన్నారు. నియోజకవర్గాల వారీగా రెవెన్యూ సదస్సులను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తామని, సంబంధితాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సదస్సుల్లో భాగస్వాములై ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

21న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ హాజరు

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులకు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. రైల్వేకోడూరు మండలంలోని మైసూరువారిపల్లెలో నిర్వహించే రెవెన్యూ సదస్సుకు హాజరవుతారన్నారు. అక్కడ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఉప ముఖ్య మంత్రి రాక సందర్భంగా అన్ని శాఖల అధికారులు తమ శాఖలలో జరుగుతున్న ప్రగతి నివేదికలతో కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. అధికారులందరూ ప్రోటోకాల్ విధిగా పాటించాలన్నారు. అధికారులందరూ సమావేశానికి కచ్చితంగా హాజరుకావాలన్నారు.

ముందస్తు పంద్రాగస్టు సంబరాలు ప్రారంభం

ముందస్తు పంద్రాగస్టు వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో ముందస్తుగా 78వ స్వాతంత్ర దినోత్సవ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు నిర్వహించే ఈ సంబరాల్లో భాగంగా తొలిరోజైన సోమవారం పట్టణంలోని డిగ్రీ, ఇంటర్మీడియట్ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రారంభమైన ఈ ర్యాలీని ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్ కూడలి, సిటిఎం రోడ్, సబ్ కలెక్టర్ కార్యాలయం, చిత్తూరు బస్టాండ్, బెంగళూరు బస్టాండ్, అనిబిసెంట్ సర్కిల్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా తొలిరోజు ర్యాలీ కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. కళాశాల విద్యార్థులు, కరస్పాండెంట్లు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు త్రివర్ణ ప్రతాకాన్ని, స్వాతంత్ర సమరయోధులు, జాతీయ నాయకుల ప్లకార్డులను చేత పట్టుకుని దేశభక్తిని చాటుకున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కనీవిని ఎరుగని రీతిలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించబోతున్నామన్నారు. మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే ర్యాలీ ఉంటుందన్నారు. 14వ తేదీ ఉదయం నుండి రాత్రి వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా టిటిడి ఆస్థాన గాయని శోభరాజు నేతృత్వంలో గానం ఉంటుందన్నారు. వేడుకలకు పట్టణ ప్రజలు, ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్, వెంకట రెడ్డి, డాక్టర్ ఎన్.సేతు, అపుష్మా జిల్లా అధ్యక్షులు ఎన్.రఘునాథరెడ్డి, సాయి చైతన్య కళాశాల కరస్పాండెంట్ నిర్మల్ కుమార్ రెడ్డి, ఫోర్డ్ డైరెక్టర్ లలితమ్మ, జనసేన దారం అనిత, గంగారపు రామ్మూర్తి నాయుడు, మార్పూరి నాగార్జున బాబు, నాగూర్ వలి, రేగడి ప్రసాద్ కుమార్, బీదం గురునాథ్ యాదవ్, జీవి నాయుడు, మార్పూరి వరుణ్, తమ్మిశెట్టి రామకృష్ణ, బాబా, పూలకుంట్ల హరిబాబు మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాధితుడు సుబ్బరాయుడు

మా భూమిని ఇప్పించండి సారూ.!

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని ఓబులవారిపల్లె మండలం చెన్నరాజు పోడు గ్రామ నివాసి పత్తి సుబ్బరాయుడు తమ భూమిని ఇప్పించండని అధికారులను వేడుకున్నాడు. సోమవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా సర్వే నంబర్ 904,1/1, 1613,1614,1616లలో 30 ఎకరాల భూమి ఉండేదన్నారు. ఇందులో 10. 80 సెంట్లు తన అవసరాల నిమిత్తం విక్రయించామని చెప్పారు. సదర భూమిని కొన్ని వ్యక్తి 1. 78 సెంట్లు అక్రమంగా ఆక్రమించుకున్నారని వాపోయారు. తన భూమి ఇప్పించాలని అధికారులను అనేకసార్లు విన్నవించినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలానికి చెందిన ఒక సీనియర్ విలేకరి భూమిని ఇప్పిస్తానని చెప్పడంతో అతనికి రూ.4.25 లక్షలు ఇచ్చానని చెప్పారు. ఇతర అవసరాల కోసం రూ. 50 వేలు ఖర్చు పెట్టానని తెలిపారు. అతను ఇంతవరకు ఎలాంటి న్యాయం చేయలేదని, ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి వెంటనే తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి : గతంలో రైల్వేకోడూర్ ఎస్ఐగా పనిచేసిన నాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఓబులవారిపల్లె మండలం చిన్నరాజుపాడు గ్రామం నివాసి దార్ల ఆనందబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జంగిటి సుభద్ర తనను ట్రాప్ చేయడంతో పాటు బ్లాక్మెయిల్ చేసి రూ. లక్ష తీసుకుందని పేర్కొన్నారు. తను డబ్బులు అడిగితే స్టేషన్‌లో పంచాయతీ పెట్టి తన భార్యపై అప్పటి ఎస్ఐ నాయక్ దాడి చేశారని వాపోయారు. ఈ విషయంపై ఎస్‌పి, డిజిపికి కూడా ఫిర్యాదు చేశానని, కానీ ఇంత వరకు న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-మదనపల్లి

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. సోమవారం యాంటీ రాగ్గింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలోని ఉన్నత విద్యావ్యవస్థలో ర్యాగింగ్ అనేది కలవరపెట్టే వాస్తవమన్నారు. ఒకప్పుడు పాఠశాల, కళాశాల అనే బేధం లేకుండా ప్రతి విద్యాలయంలో ఉండేది. ఎంతో మంది విద్యార్థులు బలయ్యారు. అందుకే దీన్ని నిరోధించడానికి ప్రత్యేకంగా చట్టాలు సైతం తీసుకొచ్చారు. కొన్ని రోజుల తర్వాత ఫలితాలు కనిపించాయి. అంతా సక్రమంగా ఉంది అనుటకు ఎంతో గర్వంగా ఉందని ఆయన అన్నారు. దీన్ని అరికట్టడానికి యూజీసీ, ఏఐసీటీఈ లాంటి పలు సంస్థలు అనేక రెగ్యులేషన్స్ తీసుకొచ్చాయి. వాటి పాటించని యెడల శిక్షా అర్హులు అవుతారని ఆయన అన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల అభ్యంతరకరంగా, అసభ్యంగా ప్రవర్తించడం, ఇబ్బంది పెట్టడం, మత్తు పదార్థాలకు బానిసలుగా మారడం లాంటి చేపడితే విద్యార్థులు వెంటనే కళాశాల అధ్యాపకులకు యాజమాన్యాలకు భయపడకుండా తెలియజేయాలన్నారు. పోలీసులు ఎప్పుడు బాధితులకు చట్ట ప్రకారం న్యాయం చేయడానికి చూస్తారని పేర్కొన్నారు. అత్యుత్సాహానికిపోయి జైలుపాలు కావొద్దని, జీవితాలను అంధకారం చేసుకోవద్దని, సీనియర్ విద్యార్థులకు ఆయన తెలియజేసారు. ఇటీవల జరుగుతున్న సైబర్ మోసాల్లో ఎక్కువగా చదవుకున్న వారే మోసపోతున్నారని, వీటిపై ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని ఆయన న్నారు. కార్యక్రమంలో అడ్వైసర్ ఆర్‌డి తులసీరామ్ నాయుడు, ఫస్ట్ ఇయర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్ర మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ యువరాజ్

పోటీల్లో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

విద్యార్థులు భాగస్వాములు కావాలి

- నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

జీవవైవిధ్య పరిరక్షణలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వక్తృత్వ, డిబేట్, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యతని, దీనిపట్ల అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అరుదైన వృక్షజంతు సంపదను కాపాడుకోవాలన్నారు. న్యాయనిర్ణేతలుగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు విశ్వభూషణ్, సుగుణ వ్యవహరించారు. పోటీలో గెలుపొందిన విజేతలు ఆగస్టు 15న రాయచోటిలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేస్తామన్నారు. వక్తృత్వంలో ప్రథమ స్థానంలో దివ్య, ద్వితీయ స్థానంలో థౌసిఫ్ అహ్మద్, తృతీయ స్థానంలో నాసిర్ హుస్సేన్ విజేతలుగా నిలిచారని చెప్పారు. డిబెట్‌లో ప్రథమ స్థానం జడ్‌పి హైస్కూల్ మసాపేట్, బిసి బాలికల గురుకులం కలికిరి, తృతీయ స్థానం టి.చదివేవాండ్లపల్లి కలికిరి మండలం కైవసం చేసుకొన్నారు. షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణలో జిల్లాలోనే ఉత్తమం కెజిబివి లక్కిరెడ్డిపల్లి విద్యార్థులు నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన అర్జీదారుల దరఖాస్తులను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, డిపిఒ ధనలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి క్షేత్రస్థాయిలో అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితులలో అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అర్జిదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ క్లియర్‌గా, స్పష్టంగా వారికి అర్థమయ్యేటట్లు ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రజల వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజ్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సురేష్ కుమార్, ఐసిడిఎస్ పీడీ శశికళ, హౌసింగ్ పీడీ శివయ్య పాల్గొన్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సోమవారం మండల పరిధిలోని హస్తవరం వద్ద రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోరుమామిళ్లకు చెందిన మృతుడు పవన్ కళ్యాణ్ (18) అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యలపైన విచారణ జరిపించాలి : ఎస్ఎఫ్ఐ

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో జరుగు ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేధింపుల ద్వారానే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరంలో రేణి అనే విద్యార్థి మృతి చెందినప్పుడు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఉంటే ఇలాంటి ఆత్మహత్యలు పునరావృతమయ్యేవికావన్నారు.

'ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరాలి'

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భారత జాతీయ జెండాతో సెల్ఫీ, సంతకాల సేకరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఇంటి మీద భారత జాతీయ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారత జాతీయ జెండాతో సెల్ఫీ కార్యక్రమం కోసం ఏర్పాటుచేసిన పోస్టర్ దగ్గర జాతీయ జెండా పట్టుకొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సంతకాల సేకరణకు ఏర్పాటు చేసిన పోస్టర్‌పై కలెక్టర్ సంతకం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

14న కెవికె స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

కృషి విజ్ఞాన కేంద్రం స్వర్ణోత్సవ వేడుకల్లో రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. 14వ తేదీన ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో మొట్ట మొదటి కృషి విజ్ఞాన కేంద్రంను అఖిల భారత వ్యవసాయ పరిశోధన మండలి పాండిచ్చేరిలో 1974లో ప్రారంభించిందని పేర్కొన్నారు. తదుపరి కెవికెలను విస్తరించి ప్రస్తుతం దేశంలో 731 కెవికెలు ఐసిఎఆర్ ఆధ్వర్యంలో రైతాంగానికి సేవలు అందిస్తున్నాయని తెలిపారు. కెవికెలు ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల భారత వ్యవసాయ పరిశోధన మండలి 'టార్చ్-రిలే' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కెవికె శాస్త్రవేత్తల బృందం వ్యవసాయ రంగంలో అందించిన సేవలకు ప్రతీకగా 11 అటారి జోనులను కలుపుకుంటూ ఢిల్లీకి చేరనుందని తెలిపారు. ఆగస్టు 13వ తేదీన టార్చ్- రిలే కెవికె పెరియవరం నుంచి కెవికె, కలికిరి చేరనుందని ఈ సందర్భంగా కెవికె కలికిరిలో 14వ తేదీన రైతులకు శిక్షణా కార్యక్రమాలు, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హుండీని లెక్కిస్తున్న అధికారులు

నేలమల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.36 వేలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని శ్రీనేలమల్లేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి రవి కిరణ్ కుమార్‌రెడ్డి, ఆలయ ఇఒ మంజుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మంజుల మాట్లాడుతూ ఆలయ హుండీని లెక్కించినట్లు తెలిపారు. నాలుగు నెలలకు హుండీ ద్వారా రూ.36,546 ఆదాయం ఆలయానికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని దేవాలయానికి సంబంధించిన ఇండియన్ బ్యాంక్ అకౌంట్, వాల్మీకిపురంలో జమచేసి, ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రెడ్డప్ప, టిడిపి నాయకులు రాజన్న, మేష రామకృష్ణ, ఆలయ అర్చకులు శంకర స్వామి, గోపాలకృష్ణ, దేవాదాయశాఖ అటెండర్ మహేష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రమేష్‌బాబు

ఎంపిడిఒగా రమేష్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా పనిచేస్తున్న కె.షాలెట్ నెల్లూరు జిల్లాకు బదిలీ కాగా, ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒగా పని చేస్తున్న రమేష్ బాబుకు పూర్తి అదనపు బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది షాలెట్‌కు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలకారు, అనంతరం ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబుకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మనోహరరాజు

వాల్మీకిపురం: ఎంపిడిఒగా మనోహర రాజు భాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సుధాకర్ రెడ్డి రామసముద్రంకు బదిలీ కాగా ఎన్నికల విధుల అనంతరం నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న మనోహర రాజు బదిలీపై వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. తడిచెత్త పొడిచెత్త ద్వారా పంచాయతీలకు ఆదాయాలను సమకూర్చాలని సూచించారు.

ఓబులవారిపల్లె (పుల్లంపేట) : ఓబులవారిపల్లి మండల ఎంపిడిఒగా విజయ రామారావు బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఇక్కడే పని చేస్తూ సార్వత్రిక ఎన్నికల నిమిత్తం నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలానికి బదిలీ కాగా మళ్లీ సాధారణ బదిలీల్లో భాగంగా నేడు ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కుళాయి స్వామి అనంతపురానికి బదిలీ చేశారు. ఎంపిడిఒ రామారావు మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి సాయి శక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. మండలంలోని అన్ని సచివాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి సచివాలయ ఉద్యోగి ప్రజలకు సేవ అందించాలని తెలియజేశారు. ప్రతి సచివాలయంలో వారానికి ఒకసారి పర్యవేక్షిస్తానని తెలిపారు.

విజయరామారావు

సూర్యనారాయణరెడ్డి

రామాపురం : మండల మండల అభివృద్ధి అధికారిగాగా ఎస్.సూర్యనారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు ఇక్కడ పనిచేస్తున్న ప్రభాకర్ అనంతపురం జిల్లా వెళ్లిపోయారు. కర్నూలు జిల్లా చాగలమరి ఎంపిడిఒగా పనిచేస్తూన్న ఎస్ సూర్యనారాయణరెడ్డి రామాపురానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తమ దృష్టికి వచ్చే పరిష్కరిస్తామన్నారు.

చిన్నమండెం : మండల అభివృద్ధి అధికారిగా దివ్య బాధ్యతలు స్వీకరించారు. గతంలో దివ్య చిన్నమండెం ఎంపిడిఒగా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా బదిలీ అయ్యారు. తిరిగి ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ మండల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా పారదర్శకంగా చర్యలు చేపడతామని తెలిపారు.

దివ్యను సన్మానిస్తున్న సిబ్బంది

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-Ist Addl. DISTRICT JUDGE, KADAPA

E.A.No.152/2024
E.P.No. 385/2020
M.V.O.P.No. 180/2017

B.Nagabhushanam. ...Petitioner

Vs

K.Venkateswarlu. ...Respondent

NOTICE TO THE RESPONDENT

Kodur Venkateswarlu, s/o Lakshminarayana, Govt. Employee, R/o D.No.2/87, Railway Station Road, Nagireddypalli Village, Nandaluru (M), Annamaiah District (A.P).

Where as the above named petitioner has filed the above E.A.No.152/2024 against the respondent for recovery of the Decree amount of Rs.2,20,581/- appearance of respondent. You are here by noticed to appear in this court either in person or through your advocate by 10.30 A.M. on 28.08.2024, failing which the case will be decided in your absence as per law. Please take notice accordingly.

//By Order of the Court//
T. ESWARA REDDY
Advocate for petitioner,
KADAPA.

Before the Deputy Registrar of Chits Arbitrator, Tirupati
ARC No. 81/2024

M/s Margadarsi Chit Fund Pvt. Ltd. Tirupati
Rep.by its Manager/Foreman ...Disputant
V/s
Mr. M.V.B.S.Chakravarthi & Others ...Opponents

NOTICE TO OPPONENT NO.1 & 5

Opp1) Mr. Mogili Vijaya Bhaskar Srinivasa Chakravarthi S/o Mogili Ashok Kumar, a/a 53 Years, D.No.2/15, Upstairs of Sai Krishna Indane Service, Main Road, PTM, Chittoor District. Now: Annamaiah District.
Opp5) Mogili Anitha, W/oMogili Vijaya Bhaskar Srinivasa Chakravarthi a/a 50 Years, D.No.2/15, Upstairs of Sai Krishna Indane Service, Main Road, PTM, Chittoor District. Now: Annamaiah District.

Please take notice that the above Dispute is posted to **06.09.2024** for your appearance before the above said Honourable District Registrar/Arbitrator Office, Tirupati at 10.30 A.M., either in person or through an Advocate and raise your objections if any, failing which the case will be decided in your absence as exparte.

Hearing Date: 06.09.2024
K.RAMESH BABU
Advocate, Tirupati. Cell: 9440095932

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట
O.S.No: 142/2018

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, బోయనపల్లి, రిప్రెజెన్టెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్. ...వాది

వర్సెస్

5. కాకలూరు వేణుగోపాల్ రెడ్డి, తండ్రి లేట్ కాకలూరు గంగిరెడ్డి, తాళ్ళపాక గ్రామం & పోస్ట్, రాజంపేట మండలం అన్నమయ్య జిల్లా. ...5వ ప్రతివాది

నోటీసు

వాది, 5వ ప్రతివాదియగు నీపైన కాకలూరి గంగిరెడ్డి తీసుకున్న లోన్ రాబట్టుకొనుటకు పై దావా దాఖలు చేసి యుంటున్నారు. సదరు దావాలో అనేకమార్లు సమన్లు పంపిననూ తీసుకోనందున 5 వ ప్రతివాది పై కోర్టులో 20.8.2024 లో ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గానీ హాజరు కానంతట పరోక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
ఏ. వి.సుబ్రమణ్యం
అడ్వకేట్, నందలూరు
సెల్ 9440129650

మురుగునీటితో ఇబ్బంది లేకుండా చూడండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారీగా వర్షాలు కురిసినప్పుడు పట్టణంలో వర్షపునీరు, మురుగునీరు రోడ్డుపై ప్రవహించడం ద్వారా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. మదనపల్లిలో సోమవారం తెల్లవారుజామున 60.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగునీటితో కలసి రోడ్లపై ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోనవలసి వచ్చింది. మురుగు నీటికాలువల్లోని మురుగు నీరు అక్కడక్కడ ప్రధాన మార్గాలపైకి రావడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా భారీ వర్షానికి సమస్యాత్మక ప్రదేశాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా తాత్కాలికంగా యుద్ధ ప్రాతిపదికన ముమ్మర చర్యలకు ఆదేశించారు. శేషప్పతోట, ప్రశాంత్ నగర్, కృష్ణానగర్, సత్యసాయి నగర్, ఎన్టీఆర్ సర్కిల్, బెంగుళూరు రోడ్డు ప్రాంతాలలో పర్యటించారు. శ్రీకృష్ణ కళ్యాణ మండపం ఎదురుగా జెసిబి సాయంతో మురుగునీరును తొలగించే కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ఆయా ప్రాంతాలలో సహాయక చర్యలు ముమ్మరం చేసేలా మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. దీనిపై పురప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ గ్రూప్స్ అధినేత మార్పురి శశిధర్ రావు, సీనియర్ నాయకులు పచ్చిపాల రామకృష్ణఆచారి, కౌన్సిలర్ మార్పురి నాగార్జున బాబు, నాగూర్ వలి, తమ్మిశెట్టి రామకృష్ణ, బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబల్లి వెంకట్రమణారెడ్డి, వేణు, జోళపాలెం దేవేంద్ర, దుబ్బిగాళ్ల భాస్కర్, బాబా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సర్దుబాటు లోపాలను సవరించాలి : ఫ్యాప్టో

పుల్లంపేట : ఎంఇఒకు వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటుకు ప్రభుత్వం చొరవ చూపడం హర్షిస్తున్నామని, లోపాలను సరిద్దిదాలని ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డికి సోమవారం ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో జీతం తీసుకుంటున్న పాఠశాలనే ప్రాతిపదికగా తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ మేనేజ్మెంట్ ఉపాధ్యాయులను మున్సిపల్ మేనేజ్మెంటులో సర్దుబాటు చేసిన తర్వాతనే మిగిలిన ఉపాధ్యాయులను ఇతర మేనేజ్మెంటులో సర్దుబాటు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వలన ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ వారిని మిగులు ఉపాధ్యాయులుగా చూపించారన్నారు. ఇలాంటి లోపాలను సరిదిద్ది ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పురం వెంకటరమణ, సుధాకర్, మోహన్, ఖాదర్ బాషా పైయని, ఖాజా పాల్గొన్నారు. **పుల్లంపేట:**ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ చాలా అసంబద్ధతతో కూడుకొని ఉన్నదని ఎంఇఒ చక్రధర్ రాజు, నాగ తిరుమలరావుకు ఫ్యాప్టో నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ లోపాయిష్టంగా ఉందన్నారు. జిఒ117ను రద్దు చేయాలని, జిఒ 53 ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు నరేంద్రనాథ్, రమణయ్య, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, రమణమూర్తి, బాల నరసింహులు, సిద్దయ్య, ఎస్.వి రమణ పాల్గొన్నారు. **ములకలచెరువు:** పాఠశాల విద్య పని సర్దుబాటు ప్రక్రియకు మినహాయింపు జిఒ నంబరు 117, జిఒ నంబరు 128 కాకుండా జిఒ నంబరు 53 ఆధారంగా పని సర్దుబాటు చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. టిడిపి నాయకులు జయచంద్రారెడ్డి, ఎంఇఒ వెంకటరమణలకు వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని ఉపాధ్యాయ సంఘం నాయకులకు జయచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జి.అమరనాథ్‌రెడ్డి, ఆదినారాయణ. పి భాస్కర్‌రెడ్డి, జి.రాజారెడ్డి పాల్గొన్నారు.

అంకురిత దీక్షతోనే లక్ష్య సిద్ధి : 'పోతుగుంట'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అంకురిత దీక్షతోనే లక్ష్యాలు సాధించవచ్చని విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. ద్రోణాచార్య మాస్టర్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు దక్షిణ భారత జాతీయ స్థాయి తేక్వాండో పోటీలలో ప్రతిభ చూపి పతకాలు సాధించిన సందర్భంగా సోమవారం జిఎంసి క్లబ్‌లో క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు పాల్గొని క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడుతూ రాజంపేట నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడలలో రాణించాలంటే క్రీడాకారులకు ఓర్పు, పట్టుదల, కృషి ఉండాలని సూచించారు. ఈ ఏడాది ప్యారిస్‌లో జరిగిన ఒలంపిక్స్‌లో 150 కోట్లు జనాభా కలిగిన భారత్ కేవలం 6 పతకాలు సాధించి 71వ స్థానంలో నిలవడం నిర్వేదానికి గురిచేసిందన్నారు. దేశంలో ఎందరో ఆదర్శనీయమైన క్రీడాకారులు ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రీడలలో రాణించి మన ప్రాంతానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. క్రీడలలో మార్షల్ ఆర్ట్స్ సాధన అత్యున్నతమైనదని, ప్రస్తుత సామాజిక పరిస్థితులలో యుద్ధ విద్యలు నేర్చుకోవడం ఆవశ్యమని తెలియజేశారు. అకాడమీ గ్రాండ్ మాస్టర్ సునీల్ మాట్లాడుతూ ఈ నెల 10, 11వ తేదీలలో తిరుపతిలో జరిగిన దక్షిణ భారత జాతీయ స్థాయి తేక్వాండో పోటీలలో తమ అకాడమీ నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారన్నారు. జూనియర్ విభాగంలో కె.వెంకట్ వినయ్ కుమార్, టి.కోమల్ కార్తికేయ, కె.పునీత్, కె.సాయి సాత్విక్ స్వర్ణ పతకాలు, సబ్ జూనియర్ విభాగంలో వై.దక్షిత రజత పతకం, జూనియర్ విభాగంలో టి.లోహిత్, ఎం.రామ్ నరసింహ రితేష్, ఇ.సుహార్స్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. అనంతరం అకాడమీ సభ్యులు రమేష్ నాయుడును శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అకాడమీ ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, కోచ్‌లు టి.చంద్రశేఖర్, బి.సుధాకర్, కె.గంగారాం, కె.నాగరాజ, ప్రముఖ ఆంగ్ల భాష బోధకులు యానాది, కూరాకు శ్రీనివాసులు, టి.సురేష్, హరి, విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు

గాలివీడు : మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసులరెడ్డి

గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పాత్ర కీలకం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ విజయ రామారావు ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లకు, సీనియర్ గ్రామ కార్యదర్శులతో రిఫ్రెషర్ శిక్షణ తరగతుల ద్వారా అవగాహన కల్పించారు. ముందుగా మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ జెండాను చేత పట్టుకుని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో వీటిని మూడు రోజులు పాటు అనగా బుధవారం సాయంత్రం వరకు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం వారందరికీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో జరిగే శానిటేషన్తో పాటుగా వెస్ట్ మేనేజమెంట్, గ్రామ అభివృద్ధి ప్రణాళిలు, పరిశీలనా విధానం, వీధి లైటింగ్, పంచాయితీలలో ఎలక్ట్రిసిటీ బిల్లులు, మెనేజ్మెంట్ వంటి పలు అంశాలపై ఈ శిక్షణా కార్యక్రమంలో సర్పంచ్‌లందరికీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి, వైస్ ఎంపిపి, ఇఒపిఆర్‌డి, ఇఒ, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ దివ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులే కీలకమని తెలియజేశారు కార్యక్రమంలో డిఎల్‌పిఒ పార్వతమ్మ, ఇఒపిఆర్‌డి పవన్ కుమార్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, పాల్గొన్నారు. **రామాపురం:** గ్రామాల అభివృద్ధికి ప్రతి సర్పంచ్, ఆయా గ్రామాల కార్యదర్శులు సహకరించాలని ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, మురుగునీటి గుంతల సమస్యలపై సర్పంచులు, కార్యదర్శులు దృష్టి సారించి పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఉషారాణి, గ్రామ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు అయోధ్య పురం నాగభూ షణ్‌రెడ్డి. మున్నీరు, ధనలక్ష్మి, సరోజమ్మ, మాదరాసు రత్నమ్మ, మున్నీరుబాష, ఆంజనేయులు, వెంకటరెడ్డి, ఆంజనేయులు, కార్యదర్శులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** పంచాయతీ కార్యదర్శులు తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఎంపిడిఒ సుధాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు మూడు రోజులపాటు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. **గాలివీడు :** డస్ట్‌బిన్‌ల ద్వారా తడి, పొడి చెత్త ఇంటి వద్దనే వేరు చేయా లని ఇఒపిఆర్‌డి శేఖర నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ సభా భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన శిక్షణ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి మాట్లాడుతూ వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాల న్నారు. పిచ్చి కుక్కలు పల్లెలలో ఉంటే వాటిని నివారిం చడానికి చర్యలు తీసుకోవాలని, డంపింగ్‌యాడ్‌లోకి తడి చెత్త పొడి చెత్త వేరు చేయాలన్నారు. గ్రామాలలో ప్రజల సహకారం తీసుకొని వానపాముల ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేయడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాలలో ఉన్న వనరులను పంచాయతీ కార్యదర్శులు సర్పంచుల సహకారంతో సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశగా దిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. క్లీన్ గ్రామపంచాయతీగా వెలిగల్లు ఎంపిక చేశామని, శిక్షణ చివరి రోజు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్య దర్శులు సర్పంచ్‌లు వెలిగలు గ్రామాన్ని సందర్శించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జెఇ రాజశేఖర్, సర్పంచులు రవికుమార్ నాయుడు, పార్థసారధిరెడ్డి, దాదినేని దీప్తి, జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు, సరోజ, హరి రాధికా పాల్గొన్నారు.

భూములు కేటాయించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : బి.కొత్తకోట మండలం, గట్టు గ్రామం, మొటుకుపల్లి పంచాయతీకి చెందిన తాము 30 ఏళ్ల క్రితం గట్టు గ్రామానికి చెందిన ఆలూరీ నరసింహరావుకు చెందిన కొనుగోలు చేశామని, వారు అ భూములకు ఎలాంటి హక్కు పత్రాలు రాసివ్వకపోగా తిరిగి అ భూములు కాజేయడానికి అయన కుమారులు సుబ్రహ్మణ్యం, సుధాకర్ బాబు, విజయ్ కుమార్ ఇతరులకు అమ్మే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ఆరోపించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కర వేదికలో సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతిపత్రాలు అందజేశారు. న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాధితుడు టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిది వై.శివ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో ల్యాండ్ సీలింగ్ కింద తాము సాగుచేసుకొంటున్న భూమినే తనకు ప్రభుత్వం తిరిగి పట్టా ఇచ్చిందన్నారు. అభూమిలో బోరు వేసుకొని, పంచాయతీ అనుమతితో ఇంటి నిర్మాణం చేసుకొని జీవనం సాగిస్తుంటే వైసిపి నాయకులు సుబ్రహ్మణ్యం భూకబ్జాల్లో భాగంగా ఇబ్బందులు పెడుతున్నారని, దీనిపై విచారించి న్యాయం చేయాలని కోరారు. బాధితులు కొమ్మిరి శంకర, మంగల గోపాల్, పీట్ల రామస్వామి, ఎ.చంద్రప్ప, బెస్త రామకృష్ణ, సాతర్ల చంద్ర, మంగళ వెంకటరమణ, ఆనంద రెడ్డి, మద్ది రెడ్డి, బత్తుల్ రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం తామంతా ఆలూరీ నరసింహరావు వద్ద భూములు కొనుగోలు చేశామని మొర పెట్టుకొన్నారు. అప్పట్లో సాగుకు పనికిరాని బంజరు భూములను తాము కష్టపడి అభివృద్ధి చేసుకుంటే ఆ భూములకు హక్కుపత్రాలు లు రాసివ్వక పోగా, పాసుబుక్ లేవన్న కారణంతో ఇతరులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్నట్లు వదంతులు రావడంతో న్యాయం కోసం సబ్ కలెక్టరును కలుసుకున్నామని పేర్కొన్నారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు తమకే హక్కులు కల్పించి న్యాయం చేయాలని సబ్ కలెక్టరుకు విన్నవించారు. అదే భూమిపై ఆధారపడి సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నామని వెల్లడించారు. కావున తమకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి ఆ భూమికి సర్వ హక్కులు కల్పించి, పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కస్తూర్బా బాలికల పాఠశాలలో జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి-రామాపురం

రామాపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.కె ఫై జున్నిసా సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని బాలికలు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులతో బోధనేతర సిబ్బందితో మాట్లాడారు. బాలికలకు కల్పించాల్సిన వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు చదువుకున్న రోజుల్లో తల్లిదండ్రుల వద్ద కన్నా ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది దగ్గర ఎక్కువ రోజులు గడుపుతారని పేర్కొన్నారు. వారికి అవసరమైన వసతుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ప్రిన్సిపల్ పుష్పలత, ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అర్జీలు స్వీకరించాలి

ప్రజాశక్తి-గాలివీడు : సమస్యలపై రైతులు ఇచ్చే దరఖాస్తులను స్వీకరించాలని తహశీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం తన ఛాంబర్‌లో విఆర్‌ఒలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డికెటి చుక్కల భూములు, ఆర్‌ఎస్‌ఆర్ నకలు వంటి సమస్యలను త్వరతగతిన స్వీకరించాలన్నారు. ఈనెల 16 నుంచి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు కూడా నిర్వహించనున్నామని, విఆర్‌ఒలు అందుబాటులో ఉండి గ్రామ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గ్రామాల్లోనే ఉండి సమస్యను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిటి తిమ్మారెడ్డి, విఆర్‌ఒలు రవీంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, అల్లాబకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

'జాతీయ నులి పురుగుల నిర్మూలన'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రాయచోటి : జిల్లాలో ఈనెల 20న నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్ములన కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లు వయస్సు లోపు గల పిల్లలు 40,6121 మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఈ నెల 20న అల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, డిగ్రీ, పాలిటెక్నిక్, నర్సింగ్ జూనియర్ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఆ రోజు మాత్రలు తీసుకోని వారి కోసం 28న ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ కొండయ్య పాల్గొన్నారు.

వైబిఎన్‌పల్లె పాఠశాలలో అతిథి భోజనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మండల పరిధిలోని వైబియన్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన మల్లిరెడ్డి సురేష్ నాయుడు తనయుడు సాయి శబరీష్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ప్రధానోపాధ్యాయులు గేని పెంచలయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గేని పెంచలయ్య మాట్లాడుతూ పాఠశాలలోని 40 మంది విద్యార్థులతో పాటు అంగన్వాడీ కేంద్రంలోని 20 మంది చిన్నారులు, వారి తల్లిదండ్రులకు భోజనాలు ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాగోతు రమేష్ నాయుడు, మల్లుగురి వేణు గోపాల్, ఉపాధ్యాయులు కె.ఎస్.పూర్ణిమ, అంగన్వాడీ కార్యకర్త కవిత పాల్గొన్నారు.

ఇంటికో స్పీకర్..ఊరికో ట్రైనర్

ప్రజాశక్తి - నందలూరు : ఇంటికో స్పీకర్-ఊరికో ట్రైనర్ అనే నినాదంతో ప్రతి ఒక్కరిని చైతన్య పరుస్తుందని ఎంబలూరు అనిల్ కుమార్ అన్నారు. ఇంఫాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్గొండలో శని, ఆదివారం రెండు రోజులు నిర్వహించిన ట్రైన్ ది వర్క్ షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస శిక్షణ తీసుకున్న 30 మందికి నిజామాబాద్ ఆర్‌టిసి ఆర్‌ఎం సరస్వతి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంబలూరు అనిల్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజానికి తన వంతుగా ఏదైనా చేయాలనుకున్న తపనతో ఇంఫాక్ట్ ఫౌండేషన్‌లో చేరానని పేర్కొన్నారు. సమాజాన్ని మేల్కొల్పే ఒక ట్రైనర్‌గా ముందుకు సాగుతానని తెలిపారు. ఈ అవార్డు తనకు దక్కినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇంఫాక్ట్ రీజనల్ ప్రెసిడెంట్ నూనె సుదర్శన్, సీనియర్ లాయర్ గోవర్ధన్, ఇంఫాక్ట్ రీజనల్ డైరెక్టర్ సరిత, మిర్యాలగూడ ఇన్‌ఛార్జి రవికుమార్,సభ్యులు గూడూరు అంజిరెడ్డి, కోట్ల సాయికిరణ్ పాల్గొన్నారు.

ఎస్ఐ గాయత్రికి సన్మానం

ప్రజాశక్తి-ములకలచెరువు : ములకలచెరువు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన గాయత్రిని సోమవారం టిడిపి నాయకులు సన్మానించారు. ఎస్ఐకు మిఠాయి బాక్సు అందజేసి అనంతరం శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో నాయకులు చేసిన అక్రమాలను అధికారులు బయట పెట్టాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ లేని విధంగా మండలంలో భూ కబ్జాలకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాలగిరి సిద్ద, నాయకులు కేశవులు, రమణమూర్తి, వెంకటస్వామి, ప్రతాప్, సోముశేఖర్, రామాంజులు, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన లారీ

ప్రయివేటు బస్సు, లారీ ఢీ : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అతివేగంగా వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ప్రయివేటు బస్సును ఢీకొన్న సంఘటన సోమవారం మండలంలోని విఠలం పాదాల గుడి సమీపంలో చోటు చేసుకొంది. వివరాలు.. తిరుపతి నుండి బెంగళూరుకు వెళ్తున్న ప్రైవేటు బస్సును మదనపల్లె నుండి తిరుపతికి వెళ్తున్న ఐషర్ లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. గమనించిన బస్సు డ్రైవర్ చాక చక్యంగా వ్యవహరించి, బస్సును పక్కనే ఉన్న చింత చెట్టు తప్పించి పక్కకు పొదల్లోకి తీసుకెళ్ళడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలకు ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా లారీ డ్రైవర్ సర్వర్ ఖాన్ అలియాస్ బాబూజీ తీవ్ర గాయలతో లారీలోనే ఇరుక్కుపోయాడు. వాల్మీకిపురం సీఐ పులిశేఖర్, ఎస్ఐలు నాగేశ్వర రావు, శ్రీహరి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి విషమంగా ఉన్న లారీ డ్రైవర్‌ను మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో బయటపడ్డ బస్ డ్రైవర్ రాఘవను చికిత్స నిమిత్తం వాల్మీకిపురంకు తరలించారు. ఐషర్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. బస్సు డ్రైవర్ రాఘవకు ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లికి రెఫర్ చేశారు. బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు స్వల్పగాయాలు కాగా మిగిలిన వారికి పెనుప్రమాదం తప్పింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మృతి చెందిన నల్లప్ప

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి వాల్మీకిపురం సమీపంలోని సబ్‌జైలు వద్ద చోటు చేసుకొంది. వివరాలు.. మదనపల్లి మండలం గుండావారి పాల్లెకు చెందిన నల్లప్ప(65) తన అల్లుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వాల్మీకిపురానికి వచ్చాడు. ఇక్కడ గురుకుల పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలతో మాట్లాడుకొని స్వగ్రామానికి తిరిగి ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలోని సబ్ జైల్ భవనం వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని దీకొన్నారు. ఈ ప్రమాదంలో నల్లప్ప మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఎస్ఐ-2 శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.